క్లుప్తంగా

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణి మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. భూ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల సమస్యలను, భూ అంశాలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల నిర్వహణలో వీఆర్వోలు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో డీటీ కృష్ణమూర్తి, సర్వేయర్ నాగభూషణం ఉన్నారు.

క్రికెట్ విజేత గడివేముల



ప్రథమ బహుమతి సాధించిన జట్టుకు నగదు అందిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో గడివేముల జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో 25 టీములు పాల్గొనగా శుక్రవారం ముగిశాయి. గడివేముల జట్టు ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచి రూ.15 వేల నగదు బహుమతి కైవసం చేసుకుంది. రెండవ బహుమతి రూ.10 వేలను బిలకల గూడూరు, మూడవ బహుమతి రూ.5 వేలను నందమూరి నగర్ జట్టు దక్కించుకున్నాయి. విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్ ఖాలీక్, దౌలత్‌బాషా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోమల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (టౌన్) : పాతబస్తీలో దోమల సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఎస్‌డీపీ అధ్యక్షుడుష్వాక్ హుస్సేన్ విన్నవించారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థలో మేనేజర్ చిన్నరాముడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర, హంద్రీ నదికి అనుకొని ఉన్న 1 వార్డు నుంచి 10 వార్డులతో పాటు బుధవారపేటలో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారన్నారు. దోమలు ప్రబలకుండా మురుగు కాల్వల శుభ్రం చేయడం, పిచికారీ, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు ఎక్కువగా చేయలని విన్నవించారు.

జూనియర్ అసిస్టెంట్ మృతికి నివాళి



పద్మావతమ్మ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పద్మావతమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్లు ప్రవీణ్‌కుమార్, హాజీమియ్యాతోపాటు సిబ్బంది నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరోవైపు డాక్యుమెంట్ రైటర్లు డాక్యుమెంట్ రాయకుండా పద్మావతమ్మ మృతికి నివాళి అర్పించారు.

21 న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు



రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఈఓ గోపీనాథ్

కర్నూలు (టౌన్) : ఈనెల 21 వ తేదీ స్థానిక రిడ్జ్ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు రిడ్జ్ పాఠశాల సీఈఓ గోపీనాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక పాఠశాల సమావేశ హాలులో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర చెస్ అసోసియేషన్, ఆల్ కర్నూలు చెస్ అసోసియేషన్, ఐకాన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టోర్నమెంటు డైరెక్టర్ రవినాయక్, కన్వీనర్లు శ్రీనివాసులు, నాగేంద్ర, కోచ్ ఇమామ్ హుస్సేన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కర్నూలు కల్చరల్ : 2024 సాధారణ ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏపీ సమగ్ర శిక్ష ఏపీసీ విజయ జ్యోతి కుమారి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీ లోపు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

టీకా.. భయం లేదిక!

- పశువుల సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు
- గతంలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వం నిర్ణయం
- ఈ నెల 31 వరకు నిర్వహణ



పెసరవాయిలో ఆవుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న వైద్యుడు బాబా ఫక్రుద్దీన్



గాలికుంటు వ్యాధి సోకడంతో గిట్టలలో పుండ్లు ఏర్పడిన దృశ్యం

గడివేముల: ఇటీవల కాలంలో పశువుల్లో అనేక వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో నివారణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసింది. గాలికుంటు వ్యాధి.. వైరస్ వలన వచ్చే తీవ్రమైన అంటు వ్యాధి. ఈవ్యాధి చీలిన గిట్టలున్న పశువులలో మాత్రమే కనిపిస్తుంది. గాలికుంటు వ్యాధి పికార్నవైరస్ వలన వస్తుంది. ఈవ్యాధి కలిగించే వైరస్‌లో ఓఏసీ, ఆసియా1, సాట్1, సాట్ 2, సాట్3 వంటి రకాలున్నాయి. సాధారణంగా వ్యాధి పశువులలో జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో వస్తుంది. వ్యాధి గాలి ద్వారా వ్యాపించును. దేశవాళీ పశువుల కంటే సంకరజాతి పశువులలో ఎక్కువ నష్టం కలగజేస్తుంది. గాలి కుంటు వ్యాధి బారిన తల్లి పశువు పాలు తాగితే దూడలు మృత్యువాత పడతాయి. గేదేలు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుంది. ఈ నెల 2 నుంచి 31 వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గ్రామాల్లో ఉన్న ప్రతి పశువుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తోంది.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం

గాలికుంటు వ్యాధి సోకిన ఆవులు, ఎద్దులు, గేదెల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. నీరసంగా మారి నడిచేందు ఇబ్బంది పడతాయి. వ్యాధి నివారణ కోసం వైద్యులు సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ గొంతువాపు ప్రాణాంతకం మందులను వాడాల్సి ఉంటుంది.

వ్యాధివ్యాప్తి

ఈవ్యాధి కలిగించే వైరస్ క్రిములు పశువు పేడ, నీరుడు, పొంగు, వీర్యము, పాలు, పుండ్లు, ద్వారా విసర్జింపబడి వేరొక పశువుకు నీటిద్వారా, గాలి ద్వారా, మేతద్వారా వ్యాప్తి చెందుతాయి.

వ్యాధి లక్షణాలు

- ఇంకుబేషన్ కాలం 2 నుంచి 6 రోజులు వ్యాధికి గురయ్యే శాతం ఒకటి నుంచి రెండు శాతం ఉండును
- జ్వరం 104 నుంచి 106 డిగ్రీలు ఫారన్‌హీట్ ఉంటుంది
- పశువుమేత మేయదు, నెమరు వేయదు,నోటిలో బొబ్బలు పగిలి చొంగకారుచుండును.
- కాలి గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి పుండ్లుగా మారి పశువులు కుంటును.
- పనిచేసే పశువుల శక్తి నశిస్తుంది.
- పాలిచ్చే పశువులలో రొమ్ములపైన, పొదుగులపై బొబ్బలు ఏర్పడి పొదుగు వాపునకు గురవును.
- ఆడపశువులలో గర్భధారణ శక్తి కోల్పోవును.
- మేకలు, గొర్రెలు, పందులలో కూడా గాలివ్యాధి వస్తుంది.

నివారణచర్యలు

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.
- పశువులశాలను 5% క్రెసాల్ నీటితో కడిగిన ఈ వైరస్ నశించును.
- ప్రక్క గ్రామాలకు వ్యాధి వున్నపుడు పశువులను సంతలకు, జాతరలకు పోనివ్వరాదు.
- ఆరోగ్యంగా ఉన్న పశువులకు గాలి కుంటువ్యాధి నిరోధక టీకా మొదటిసారి 2 నెలల వయస్సులో వేయించాలి. బూస్టర్ డోసు ఒక మాసం తర్వాత వేయించాలి. ఆ తరువాత క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం టీకా వేయించాలి.
- టీకా మందు మోతాదు 2 ఎంఎల్ ఇవ్వాలి.
- టీకాలు వేసిన తరువాత 1 నుంచి 3 వారాలలో వ్యాధి నిరోధకశక్తి పెంపొంది పశువులలో వ్యాధి సోకకుండా ఉంటుంది.
- పశువులకు ఈనిన తరువాత టీకాలు వేయించాలి
- కలుషితమైన పశువుల దాణా మేతలను తగలబెట్టాలి.
- వ్యాధి సోకిన ఆ బోతులు, దున్నలను సంపర్కానికి వినియోగించకూడదు.
- పాలను మరగకాచి మాత్రమే మనుషులు వినియోగించాలి.
- ఈ వ్యాధితో బాధపడుచున్న పశువుయొక్క పాలను త్రాగినలేగ దూడలు చనిపోవును.
- పశువుల కళేబరాన్ని, లోతైన గొయ్యి తీసి అందులో సున్నం వేసి పాతిపెట్టాలి. లేదా కాల్చివేయాలి.తద్వారా గాలికుంటు వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చును.

టీకాతో నివారణ



గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ప్రత్యేక టీకా కార్యక్రమం పెట్టారు. గ్రామాలలో పాడిరైతులు తమ ఆవులు, ఎద్దులు, గేదెలకు తప్పకుండా గాలికుంటు టీకా వేయించాలి. ఈ వ్యాధిసోకితే రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ నెల 2 నుంచి 31 వరకు ఉచితంగా టీకాలు వేయడం జరగుతుంది. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకా వేయించాలి. వ్యాధి రాకుండా ముందస్తుగా ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. వ్యాధి లక్షణాలు ఉన్నట్టైతే ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ 155251 నెంబర్‌కు గాని ఆయా గ్రామాలలోని రైతుభరోసా కేంద్రాలలో సమాచారం ఇవ్వగలరు.

– డాక్టర్ సాయిహరిణి, పశువైద్యాధికారిణి, గడివేముల

దరఖాస్తు చేసుకోండి

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూల పెద్దమ్మ ఆలయ ధర్మకర్త మండలి ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి ఉన్న సభ్యులు ఫిబ్రవరి 6 లోపు నంద్యాల జిల్లా దేవ దాయశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

తూకాల్లో తేడాలొస్తే కేసులు నమోదు చేస్తాం

కర్నూలు (న్యూటౌన్): తూకాల్లో తేడాలతో వినియోగదారులను మోసం చేస్తే చట్ట పరంగా కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులోని కమీషన్ ఏజెంట్ల షాపుల్లో ఆకస్మికంగా దాడుల చేసి నాన్ ఆటోమేటిక్ ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ యార్డులోని కమీషన్ ఏజెంట్లకు సంబంధించిన 35 నాన్ ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను తనిఖీ చేసి వాటికి సీళ్ల వేశామన్నారు. తూకాలకు ముద్ర లేకపోతే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీకి 159 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.554 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని తహసీల్దార్ జయన్నతో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. ప్రజలు బీపీ, షుగర్, కంటి, రక్త, ఒంటి పరీక్షలు చేయించుకోవడంతో పాటు, ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలని వారు సూచించారు. కాగా వైద్య శిబిరాన్ని జిల్లా మలేరియా ఆఫీసర్ నూకరాజు తనిఖీ చేసి ప్రజలకందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. గ్రామంలో పర్యటించి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు బాలక్రిష్ణ, భాస్కర్, శ్రీవిద్య, భాస్కర్ రావు, శ్రీదేవి, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలు పొందుతున్న ప్రజలు

చిందుకూరులో సురక్ష వైద్యశిబిరం

గడివేముల: మండల పరిధిలోని చిందుకూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మొల్లా జబీన్ హాజరై పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగరు, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం కొందరిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, పీహెచ్‌ఎన్ సర్వేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధర ప్రకారం కందులు కొనుగోలు చేస్తాం

- డీఎస్‌ఓ ప్రసాద్

కల్లూరు: మార్కెట్ ధర ప్రకారమే రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తామని జిల్లా సివిల్ సప్లైయ్ అధికారి (డీఎస్‌ఓ) ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లక్ష్మీపురం, నాయకల్లు గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌ఓ మాట్లాడుతూ కందులు విక్రయించాలనుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏ/వీహెచ్‌ఏలను సంప్రదించాలన్నారు. కందుల విక్రయం అనంతరం వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. ఉచితంగా గోనె సంచులు సరఫరా చేయడంతో పాటు లేబర్ చార్జీల భారం, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కందులను పప్పుగా మార్చి కార్డు దారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాయితీతో అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్‌బీకేల్లోనే కందుల కొనుగోళ్లు

కోడుమూరు రూరల్: రైతులు పండించిన కందులను పౌరసరఫరాల శాఖ సహకారంతో శనివారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేయనున్నామని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ తెలిపారు. శుక్రవారం రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, వీఆర్వోలతో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జయన్నతో కలిసి ఏఓ రవిప్రకాష్ సమావేశం నిర్వహించారు. క్వింటాల్ రూ.9,300 ప్రకారం రైతుల నుంచి కందులను కొనుగోలు చేయనున్నట్లు ఏఓ తెలిపారు. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు చెప్పారు.

ముగిసినశిక్షణ తరగతులు

ఓర్వకల్లు: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఈ నెల 17న ప్రారంభమైన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ శివనాగప్రసాద్ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక ఏడాదికి సంబంధించి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. గ్రామాల వారీగా నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపితే అవసరమైన నిధుల కేటాయింపు జరుగుతుందన్నారు. పారిశుధ్యం, తాగునీరు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులపై సమగ్ర నివేదికలు పంపాలని ఆయన సూచించారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్

విద్యుత్ స్తంభాల ఏర్పాటు ప్రక్రియను విరమించుకోవాలి

కల్లూరు: రైతుల పంట పొలాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు ప్రక్రియను విరమించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రకత్వ గ్రామానికి చెందిన దళిత రైతుల పొలాలను ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శితో పాటు సమాచార హక్కు చట్టం నాయకులు జయన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్ తదితరులు పరిశీలించారు. రైతుల అనుమతి లేకుండా తక్కువ నష్టపరిహారం చెల్లించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం తగదన్నారు.

అయోధ్యకు వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: అయోధ్యలో ఈనెల 22వ తేదీన జరగనున్న రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, మరికొందరు నాయకులు శుక్రవారం బయలు దేరారు. వారికి బజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వీహెచ్‌పీ నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు, నాయకులు భగీరథ, ముత్యాల ఈశ్వర్, హరి, జయప్రకాష్, సాయి ప్రణీత్, రాము, సాయిరాం, తదితరులు వీడ్కోలు పలికారు.

ఉద్యోగుల అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు



ఉద్యోగుల నుంచి వినతులను స్వీకరిస్తున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్) : ఉద్యోగుల స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు చూపేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగుల స్పందనను డీఆర్వో అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఉద్యోగుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఏదైనా కారణంతో పరిష్కారం చేయలేకపోతే అందుకు తగిన కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు.

పకడ్బందీగా కుల గణన



వివరాలు తెలుకుంటున్న డీఎల్‌డీఓ బాలకృష్ణా రెడ్డి

గూడూరు: కులగణనను పకడ్బందీగా నిర్వహించాలని కర్నూలు డివిజినల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కే.నాగులాపురం గ్రామంలో జరుగుతున్న కుల గణనను ఆయన పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది సేకరిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేవారు.

వర్కూరులో..

కోడుమూరు రూరల్: కులగణనను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ జయన్న సూచించారు. మండలంలోని వర్కూరు గ్రామంలో జరుగుతున్న కులగణనను ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు.



కులగణనను పరిశీలిస్తున్న అధికారులు

లొద్దిపల్లెలో..

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లెలో శుక్రవారం కుల గణన చేపట్టారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. కుటుంబలోని సభ్యులు సంఖ్య, ఆర్థిక స్థితిగతులు, ఇల్లు, వృత్తులు తదితర సమగ్ర వివరాలను ఈకేవైసీ ఆధారంగా నమోదు చేసుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవించండి

కోడుమూరు: గొడవలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో జీవించాలని కర్నూలు డీఎస్పీ విజయ్‌శేఖర్ సూచించారు. శుక్రవారం రాత్రి కోడుమూరు మండలంలోని అమడగుంట్ల గ్రామంలో డీఎస్పీ విజయశేఖర్ సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి పర్యటించారు. ప్రజలతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎవరైనా గొడవలకు ఉసి గొల్పినా వాటి జోలికి వెళ్లొద్దన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఎవరికి నచ్చిన నాయకుడికి వారు ఓటు వేసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అమడగుంట్లలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌శేఖర్

నేటి నుంచి కులగణన

- నగరంలో ఈనెల 28 వరకు ఇంటింటి సర్వే
- 136 సచివాలయాల పరిధిలో 1100 మంది ఉద్యోగుల నియామకం
- సామాజిక కులగణన సర్వేకు సహకరించాలని అధికారుల విజ్ఞప్తి

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం సామాజిక కులగణన సర్వేకు శ్రీకారం చుట్టింది.ఈ సర్వే ద్వారా ప్రతి ఒక్క కుటుంబం సామాజిక ఆర్థిక స్థితిగతుల వివరాలు సేకరించనుంది. దేశంలో 1931వ సంవత్సరంలో కులగణన సర్వే చేపట్టారు. అప్పటి నుంచి ఏ రాష్ట్రంలో కూడా కులగణన సర్వేలు చేపట్టలేదు. మొట్టమొదటి సారిగా ఏపీ సర్కారు అన్ని కులాల ఆర్థిక స్థితిగతులు తెలుసుకునేందుకు సర్వే చేపడుతుంది. ఈ నెల 20 వ తేదీ నుంచి 28 వ తేదీ వరకు ప్రతి సచివాలయం పరిధిలో ఈకార్యక్రమం జరుగనుంది. ఇందుకోసం 1100 మంది సచివాలయాల ఉద్యోగులను ఇప్పటికే నగరపాలక సంస్థ అధికారులు నియమించారు. వీరి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు 11 మంది సూపర్‌వైజర్లను, ప్రతి సూపర్‌వైజర్‌కు ఇద్దరు అసిస్టెంట్లను నియమించారు. 10 రోజుల పాటు నగరంలోని 136 సచివాలయాల పరిధిలోని 1.19 లక్షల కుటుంబాల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తారు.

అట్టహాసంగా ‘ఆడుదాం..ఆంధ్రా’ పోటీలు

ఓర్వకల్లు: ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నోడల్ ఆఫీసర్ శివనాగప్రసాద్ బహుమతులు అందజేశారు. కబడ్డీలో శకునాల జట్టుపై గుట్టపాడు జట్టు, క్రికెట్‌లో హుసేనాపురం–1 జట్టుపై, ఓర్వకల్లు జట్టు, వాలీబ్ పోటీలో గుట్టపాడు జట్టు విజయం సాధించినట్లు నోడల్ ఆఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఓంకార్ యాదవ్, ఫిజికల్ డైరెక్టర్ హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీకాంతా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పరిమిళ పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

గడివేముల: గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ స్కూల్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఆయన టాస్ వేసి ప్రారంభించారు. కబడ్డీలో గడివేముల జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలచెన్ని, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శులు తారకేశ్వరి, రంగడు, నాగేశ్, పీఈటీ భుజంగరావు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం,



టాస్ వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

రసవత్తరంగా క్రికెట్ పోటీలు

సి.బెళగల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో భాగంగా మండల స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం రసవత్తరంగా సాగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల క్రీడా మైదానాల్లో క్రికెట్ పోటీలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, పీడీలు వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర నిర్వహించారు. 8 గ్రామ సచివాలయాల జట్లకు మొదటి రెండవ లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. లీగ్ దశ ముగియడంతో మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌ను పలుకుదొడ్డి, పోలకల్ – 2, రెండవ సెమీఫైనల్ మ్యాచ్ సి.బెళగల్ – 2, కంబదహాల్ జట్ల మధ్య శనివారం నిర్వహించడం జరుగుతుందని వ్యాయామ ఉపాధ్యాయులు సుంకరావు, చక్రపాణి తెలిపారు.



విజేత పోలకల్ - 2 జట్టు సభ్యులను అభినందిస్తున్న అధికారులు

10 సిక్సర్లతో 73 పరుగులు చేసిన చరణ్..

మొదటి లీగ్ మ్యాచ్‌లో ఇనగండ్ల – సి.బెళగల్ – 2 గ్రామ సచివాలయాల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఇనగండ్ల జట్టు నిర్ణీత 10 ఓవర్లకు 5 వికెట్లు నష్టపోయి 112 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సి.బెళగల్ – 2 జట్టు 7.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 116 పరుగులతో ఘన విజయం సాధించింది. సి.బెళగల్ – 2 జట్టు బ్యాటర్ చరణ్ 20 బంతులను ఎదుర్కొని 10 సిక్సర్లు, నాలుగు ఫోర్లతో 73 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. రెండవ లీగ్‌లో పోలకల్ -2 – కొత్తకోట -2 (ఈర్లదిన్నె) జట్ల తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన పోలకల్ – 2 జట్టు నిర్ణీత 10 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 193 భారీ పరుగులను చేసింది.

పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్.డి.వి. అజీజ్ రచించిన ‘అల్లూరి సత్యనారాయణ రాజు’ నవల హిందీ అనువాదం పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పూర్వ శాసన మండలి సభ్యులు ఎం.వి.వి.ఎస్.శర్మ, అల్లూరి సత్యనారాయణరాజు సోదరులు ప్రముఖ న్యాయవాది అల్లూరి సీతారామరాజు అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.